క్లుప్తంగా

వినాయక చవితి శుభాకాంక్షలు

● మంత్రి జయరాం



ఆలూరు: గణేష్ ఉత్సవాలను కుల, మతాలకు అతీతంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

ఎమ్మిగనూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో అందరికీ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంఈహెచ్ఈఓ విజయకృష్ణ తెలిపారు. శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమప్పనగర్, శిల్పా కాలనీ, రాఘవేంద్ర కాలనీ, గాంధీనగర్ 2 సచివాలయల పరిధిలో ఆరోగ్య సర్వే నిర్వహించారు. గుర్తించిన వ్యాధులను బట్టి ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు వైద్యులతో కూడిన వైద్యబృందంతో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 30న శిల్పాకాలనీలో, అక్టోబర్ 3న క్యూబుల్లా కాలనీ, 5న లక్ష్మిపేట, 7న శివన్న నగర్‌లో హెల్త్ క్యాంపులు ఉంటాయన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రుని కుంభోత్సవం

హొళగుంద: మండల కేంద్రంలో శనివారం శ్రావణమాసం ముగింపులో భాగంగా వీరభద్రేశ్వరస్వామి కుంభోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానికులతో పాటు బంధువులు, చుట్టు పక్కల గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

సమస్యలుంటే పరిష్కరించుకోవాలి

నందవరం: సమగ్ర భూ రీ సర్వేలో సమస్యలుంటే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నిత్యానందరాజు రైతులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని ధర్మపురం గ్రామంలో రీసర్వేపై రైతులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిందని, పేర్లు, ఆర్వోలు, సర్వే నంబర్లలో తప్పులుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఉచితంగా భూ సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్‌బాషా, ఆర్ఐ జెర్మియా, పంచాయతీ కార్యదర్శి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఓజోన్ పొరను రక్షించుకోవాలని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, హైస్కూల్ హెచ్ఎం శోభ సూచించారు. కళాశాల, ఎస్ఎన్ఎస్ జెడ్పీ హైస్కూల్, ఎంఎస్ బాలికల హైస్కూళ్లలో వేర్వేరుగా శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఓజోన్ పొర గురించి తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు.

● హొళగుంద: జీవరాశికి ఓజోన్ పొర రక్షణ కవచమని దాని పరిరక్షణ అందరి బాధ్యతని హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నజీర్ అహమ్మద్ అన్నారు. శనివారం పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పరామర్శ

తుగ్గలి: గత నెలలో రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన మాజీ ఎమ్మెల్యే దివంగత తమ్మారెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా రీజినల్ కో ఆర్డినేట్ రామసుబ్బారెడ్డి పరామర్శించారు. శనివారం రాత్రి పత్తికొండ నుంచి జమ్ములమడుగుకు వెళ్తూ మార్గమధ్యలో తుగ్గలిలోని వారి స్వగృహానికి వెళ్లారు. ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరెడ్డి, సింగిల్‌విండో చైర్‌పర్సన్ విజయలక్ష్మిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

టెంకాయల వేలం పాట

గోనెగండ్ల: అక్టోబర్ 4, 5, 6 తేదీలలో మండల కేంద్రంలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవం సందర్భంగా టెంకాయలు విక్రయించుకునేందుకు శనివారం వేలంపాట నిర్వహిచంఆరు. ఆలయ పూజారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కర్నూలు, బళ్లారి, ఆదోని ప్రాంతాల నుంచి వ్యాపారులు పాల్గొన్నారు. బళ్లారికి చెందిన లక్ష్మి రూ.1.60 లక్షలకు పాట పడి దక్కించుకుంది. గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, దొరబాబు, రంగముని, కొలుట్లయ్య, పూజారులు కొలుట్లయ్యస్వామి, ఓబులయ్య స్వామి, మందకల్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు మోటార్లు

ఆలూరు: వైఎస్సార్ జలకల ద్వారా ప్రభుత్వం తవ్వించిన బోర్లకు మోటార్లును పంపిణీ చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. హాలహర్వి మండలం విరుపాపురం గ్రామ రైతు ఉల్లెప్పకు ప్రభుత్వం మంజూరు చేసిన మోటారును ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడారు.

ముగిసిన స్కూల్ గేమ్స్

ఆలూరు రూరల్: రెండు రోజులగా ఆలూరు ప్రభుత్వ బాలుర-2 పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ-2 చిరంజీవి రెడ్డి, బాలుర-2 పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. రెండు రోజులుగా నిర్వహించిన క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 30న జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణాలు

● ప్రైవేట్ వైద్యుల నిర్వాకంతో వారం వ్యవధిలో ఇద్దరు మృతి
● అనుమతుల్లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు
● పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

➡ ఇక్కడ కనిపిస్తున్న ముద్దులొలికే బాలుడి ప్రాణం వచ్చీరాని వైద్యం కారణంగా గాలిలో కలసిపోయింది. ఫలితంగా తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలింది. పట్టణానికి చెందిన బాలుడిని బొడ్డు వద్ద చిన్న గుల్ల ఉందని శ్రీనివాస సర్కిల్లోని ఓ చిన్నపిల్లల హాస్పిటల్‌కు వైద్యం కోసం తల్లిదండ్రులు ఈనెల 6న తీసుకెళ్లారు. మందులిచ్చినా తగ్గకపోవటంతో వైద్యుడి అసిస్టెంట్ చికిత్స చేసేందుకు కత్తితో బొడ్డు వద్ద కాటు పెట్టాడు. కత్తి కాటు పెట్టే సమయంలో బాలుడి పేగులు తెగిపోయి బయటకు వచ్చాయి. తీవ్ర రక్తస్రావం కావటంతో పేగులు కనిపించకుండా కాటన్ పెట్టి కట్టుకట్టి భయటకు వచ్చి బాబు పరిస్థితి బాగోలేదని, కర్నూలుకు తీసుకెళ్లాలని సలహా ఇవ్వడంతో అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రక్తంతో ఉన్న బట్టను తల్లిదండ్రులు తీసి చూడగా పేగులు బయటకు రావటం గమనించి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయాడంటూ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తప్పును ఒప్పుకుని, బేరం కుదుర్చుకొని కేసు లేకుండా వైద్యులు తప్పించుకున్నారు. చిన్నారి ప్రాణం మాత్రం తెచ్చివ్వలేకపోయారు.





➡ పండంటి ఆడ బిడ్డకు ప్రాణం పోసి తన ప్రాణం విడిచిన ఈ మహిళ పేరు మౌనిక. సి.బెళగల్ మండలం. ఈనెల 15న పురిటి నొప్పులతో వీవర్స్ కాలనీలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో చేరి సాధారణ కాన్పులోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డను చూసి మురిసిపోయింది. అంతలోనే కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు డాక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా ఎంతకూ స్పందించలేదు. ఒక పక్క రక్తస్రావం, మరో పక్క నొప్పి భరించలేక కేకలు వేస్తూ ప్రాణాలొదిలింది. మృతురాలి బంధువులు ఆస్పత్రి డాక్టర్లకు, సిబ్బందికి దేహశుద్ధి చేయడంతో పరిహారం చెల్లించి కేసు కాకుండా జాగ్రత్త పడ్డారు. కానీ చిన్నారిని తల్లి లేని బిడ్డను చేశారు.

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 20కి పైగా ప్రైవేట్ నర్సింగ్ హోంలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. నర్సింగ్ హోంల నిర్వాహకులు డబ్బు సంపాదన యావతో ఒకరు ఇద్దరు అర్హత ఉన్న డాక్టర్లను ఏర్పాటు చేసుకుని మిగతావారిని అర్హత లేని డాక్టర్లను ఏర్పాటు చేసుకోవడంతో వారు వచ్చీరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలు తీసుకున్నారు. గత పది రోజుల వ్యవధిలోనే ప్రైవేట్ నర్సింగ్‌లలో ఇద్దరు అకాల మరణం చెందమే ఇందుకు నిదర్శనం. బయటకు రాని మరణాలు కూడా చాలానే ఉన్నాయి.

విచారణ నామమాత్రమే..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు జిల్లా వైద్యాధికారుల దృష్టికి వెళ్తే వారు హడావుడి చేస్తారు. తూతూ మంత్రంగా విచారణ చేసి రిపోర్టు రాసుకొని, నర్సింగ్ హోంల నిర్వాహకులు ఇచ్చే ముడుపులు తీసుకొని వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా గాకుండా ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకుని మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ జరిపిస్తాం

పట్టణంలో ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో బాలింత మృతి చెందిన ఘటన మా దృష్టికి వచ్చింది. ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓతో విచారణ చేయిస్తాం. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. రోగులు కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు రాజీ పడకుండా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. – డాక్టర్ భాస్కర్, ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి, కర్నూలు

సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

● ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: ఈనెల 19న ఆలంకొండ సమీపంలో ఏర్పాటు చేసిన 77 చెరువులకు నీరు మళ్లించే పథకం ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. శనివారం కృష్ణగిరిలో ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.253 కోట్లతో చెరువులకు నీరు మళ్లించే పథకం పూర్తి చేశామన్నారు. వైఎస్సార్ హయాంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా కాలువ ఏర్పాటు చేయగా, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇదే కాలువ నుంచి నాలుగు నియోజకవర్గాల్లోని 77 చెరువులకు నీరు మళ్లించే పథకం పూర్తి చేసి ప్రారంభించడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. 19న మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, యూత్ కన్వీనర్ లక్ష్మికాంత రెడ్డి, నాయకులు రంగనాయకులు, భీమిరెడ్డి, లాయర్లు మహేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హొళగుంద: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లతో కలిసి ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు పడకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.

●నందవరం: మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా గ్రామ పెద్దలతో గణేశ్ ఉత్సవాలపై సీఐ మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

● ఆస్పరి: వినాయక చవితి పండుగను కలిసి మెలసి జరపుకోవాలని ఎస్ఐ వరప్రసాద్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మండపాల వద్ద ప్రజలకు ఇబ్బంది కలిగేలా పెద్దపెద్ద శబ్దాలు వచ్చేలా మైకులు పెట్టొద్దన్నారు.

● చిప్పగిరి: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని ఉపయోగించుకునేలా చూడాలని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, మండల అధికారులకు, నాయకులకు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కాగా పలువురు అధికారులు సభకు గైర్హాజరు కావడంతో సమస్యలు ఎవరికి చెప్పాలని ప్రజాప్రతినిధిలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ సీవీ కొండయ్య, తహసీల్దారు లక్ష్మీనారాయణ, మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్, ఎంఈఓ బాలనాయుడు, విద్యుత్ ఏఈ ఉలిగన్న, ఏపీఎం నాగార్జున, సింగిల్ విండో అధ్యక్షులు మల్లికార్జున, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి



గాయపడిన బాలుడు

ఆలూరు రూరల్: పిచ్చికుక్క దాడిలో మండలంలోని హత్తిబెళగల్ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడు మౌలా హుసేన్ గాయపడ్డాడు. తల్లింద్రులు తెలిపిన వివరాలు.. సాయంత్రం తన ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా విచక్షణారహితంగా తలపై దాడి చేసింది. గాయపడిన బాలుడికి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

పత్తికొండటౌన్: ఈనెల 13న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పత్తికొండ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ రేష్మాకౌసర్, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌నాయక్ తెలిపారు. శనివారం కళాశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు ప్రవల్లిక, తేజేశ్వర్‌లను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్-18 బాలికల విభాగం 800మీటర్ల పరుగుపందెంలో ప్రవల్లిక రెండవస్థానం, అండర్-18 బాలుర విభాగం 800 మీటర్ల పరుగుపందెంలో తేజేశ్వర్ రెండవస్థానం, లాంగ్ జంప్‌లో తృతీయస్థానం సాధించారన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు.

టిడ్కో గృహాల్లో లబ్ధిదారుల గృహ ప్రవేశాలు



శివన్న నగర్‌లో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ వద్ద నిర్మించిన టిడ్కో గృహాల్లో శనివారం లబ్ధిదారుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఆయా గృహ లబ్ధిదారుల జాబితాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించి గృహాలకు సంబంధించిన తాళం చెవులను, గృహాల కేటాయింపు పత్రాలను ఆయా వార్డు కౌన్సిలర్లచే అందజేశారు. అలాగే కొందరు లబ్ధిదారులకు మున్సిపల్ కౌన్సిలర్లు రాజరత్నం, సూరి, గట్టు ఖాజా తదితరులు ఇంటి పత్రాలు అందజేసి గృహాల్లో ప్రవేశం చేయించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి, లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. 14వ వార్డులో కౌన్సిలర్ ఖాశింబేగ్‌తో కలిసి ఆయన వార్డులో పర్యటించిన సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై ప్రచారం

వెల్దుర్తి: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ఇంటింటి ప్రచారం మండల కేంద్రంలో శనివారం ప్రారంభమైంది. ఈనెల 30న మండల కేంద్రంలో వైద్య శిబిరం (హెల్త్ క్యాంప్) నిర్వహించనున్న నేపథ్యంలో మొదటి దశను హెల్త్ క్లినిక్ పరిధిలోని ఇళ్లకు ఏఎన్ఎమ్ రంగవల్లి, ఎంఎల్‌హెచ్‌పి అరుణలు రెండు టీమ్‌లుగా ఆశా కార్యకర్తలతో కలిసి వెళ్లి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. పలువురికి బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఈనెల 30న జరిగే వైద్య శిబిరానికి హాజరై ఉచితంగా సేవలు పొందాలంటూ టోకెన్ అందించారు. రామళ్లకోట పీహెచ్‌సీ ఎమ్‌పీహెచ్ఈఓ సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఉన్నతి'తో ఉపాధి

తుగ్గలి: ఉపాధి కూలీల కుటుంబాల్లోని పిల్లలకు 'ఉన్నతి' ద్వారా ఉపాధి కల్పించనున్నట్లు ఉన్నతి జాబ్ కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు. స్థానిక ఎంఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో శనివారం ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించారు. వంద రోజులు పని చేసిన కుటుంబాల్లో యువతీ, యువకులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. 2019 నుంచి వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతీ, యువకులను గుర్తించాలన్నారు. 18 నుంచి 26 ఏళ్ల లోపు వయసు ఉండి పదో తరగతి పాసైన వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఉపాధి కూలీల కుటుంబాలకు అవగాహన కల్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వెల్దుర్తి: మార్గదర్శి వికలాంగుల మండల సమాఖ్య భవనానికి స్థలం కేటాయించాలని సమాఖ్య మండల అధ్యక్షుడు రామగిడ్డయ్య, కార్యదర్శి శ్రీరాములు తదితరులు శనివారం తహసీల్దార్ శివరాముడుకు వినతిపత్రం అందించారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం



మట్టి వినాయకుల ప్రతిమలకు పూజ చేస్తున్న చిన్నారులు

ఎమ్మిగనూరుటౌన్: మట్టి వినాయకులను తయారు చేసుకొని వినాయకచవితి పండుగ నిర్వహించుకోవాలని స్థానిక ఐ స్కూల్ కరస్పాండెంట్ యయు బాబునరేంద్రప్రసాద్ సూచించారు. శనివారం పాఠశాలలో చిన్నారులు మట్టితో వినాయకుల ప్రతిమలను తయారు చేసి పూజలు చేశారు. ఈసందర్భంగా చిన్నారులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులు పర్యావరణ హితులు



మట్టితో వినాయకునికి రూపమిచ్చిన విద్యార్థినులు

వెల్దుర్తి: మట్టితో తయారుచేసిన వినాయకులు పర్యావరణ హితులని బాలికల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చంద్రావతి అన్నారు. శనివారం ఓజోన్ డే సందర్భంగా పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం ఆధ్వర్యంలో విద్యార్థినులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.

హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలి



కర్నూలులో డీఆర్, ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దేవనకొండ: గుండ్లకొండ దగ్గర హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగు నీరు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం నాయకులు శనివారం కర్నూలులోని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ, హంద్రీనీవా సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌లకు వినతి పత్రం అందజేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ, అధ్యక్షులు బి.వీరశేఖర్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి మాట్లాడుతూ రాయలసీమ కరువు ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించేందుకు హంద్రీనీవా సుజలా స్రవంతి నిర్మాణం చేపట్టారని, హంద్రీనీవా కాలువ ద్వారా వెనకబడిన జిల్లాకు 82 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆయకట్టును నిర్దేశించిందన్నారు. అందులో బాగా వెనకబడిన ఇతర సాగునీటి వనరులు లేని దేవనకొండ మండలంలో 42 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు రూపలకల్పన చేశారన్నారు. హంద్రీనీవా మొదటి ఫేజ్‌లో కర్నూలు జిల్లా ఉందని, పందికోన రిజర్వాయర్ నిర్మాణం చేయడం, రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువలు పూర్తి చేశారు తప్ప పంట కాలువలు నిర్మాణం చేపట్టలేదని, అందువల్ల లక్ష్యం నెరవేరలేదన్నారు.

రైతుల మధ్య ఘర్షణ



రైతులకు సర్ది చెబుతున్న పోలీసులు

చిప్పగిరి: మండలంలోని ఏబీసీ కెనాల్ ఆయకట్టు రైతులు – నాన్ ఆయకట్టు రైతుల మధ్య శనివారం స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఏబీసీ కెనాల్ పరిధిలో చిప్పగిరి, డేగులహాలు, ఏరూరు, మల్లికార్జున పల్లి, రామదుర్గం బెల్డోణ తదితర గ్రామాల్లో 40 కి.మీ మేర రైతులు వివిధ పంటలు సాగుచేశారు. ఆయకట్టు రైతులతో పాటు నాన్ ఆయకట్టు రైతులు సుమారు 600 మోటార్లు కాలువపై ఉంచి నీటిని తోడుకొని పొలాలకు అక్రమంగా వాడుకుంటుండడంతో శనివారం ఏబీసీ కెనాల్ జేఈ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆయకట్టు రైతులతో కలిసి 13వ కిలోమీటర్ వద్ద నుంచి మోటార్లు తొలగించుకుంటూ వెళ్లగా 10వ కిలోమీటర్ వద్ద ఒక్కసారిగా వందల సంఖ్యలో రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఘర్షణ చోటు చేసుకుంది. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. కాగా రైతులపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

దేవనకొండ: స్థానిక కేజీబీవీ విద్యార్థినులు శనివారం అస్వస్థతకు గురయ్యారు. వీరిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. విద్యార్థినులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం భోజనం అనంతరం దాదారు 20 మంది విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. అందులో నలుగుర విద్యార్థినులు తీవ్ర కడుప నొప్పితో బాధ పడుతుండటంతో ప్రిన్సిపాల్ సుమిత్ర వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్ కళ్యాణ్ వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థినులకు వైద్యం చేశారు. కొందరికి సెలైన్ ఎక్కించారు. మధ్యాహ్నం అన్నం సరిగా ఉడక్కపోవడం, కొంత కాలంగా కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో నీరు, ఆహారం కలుషితమై విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం.

సీఎం విశ్వబ్రాహ్మణుల పక్షపాతి

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రాహ్మణుల పక్షపాతి అని విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు కమ్మర హరికృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం తాలూకా అధ్యక్షుడు శంకరయ్యాచారి అన్నారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా జరపాలని ప్రభుత్వం ఇచ్చిన జీఓ కాపీలను శనివారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏఓ సతీష్‌కు, తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఈరమ్మకు అందజేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయంలో విశ్వకర్మ జయంతిని జరిపేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మహానంది ఆచారి, పరమేష్‌ఆచారి, కాలయ్యాచారి, బ్రహ్మయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

అయ్యకొండ ఆదర్శం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

గోనెగండ్ల: సమస్యలు, గొడవలకు దూరంగా ఉంటూ పలు గ్రామాలకు అయ్యలకొండ ఆదర్శంగా నిలుస్తోందని తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ తిమ్మారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కనకలక్ష్మి అన్నారు. శనివారం అయ్యకొండ గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవ సంస్థ అధికారులు చేపట్టిన సర్వేలో సమస్యలు, గొడవలు, పోలీస్ స్టేషన్‌కు దూరంగా ఉన్న గ్రామంగా జిల్లాలో అయ్యకొండ గ్రామం మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లా న్యాయ సేవ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారన్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో గ్రామాన్ని అభివృద్ధి బాటాలో నడిపిస్తామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా న్యాయ సేవ సంస్థ పాటు పడుతుందన్నారు.

శ్యాంబాబూ.. ఇకనైనా పద్ధతి మార్చుకో

● వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి



మాట్లాడుతున్న చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి

వెల్దుర్తి: 'ఇంకెన్నాళ్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు, ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తావు, ఇకనైనా పద్ధతి మార్చుకో శ్యాంబాబూ' అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి హితవు పలికారు. శనివారం మండల కేంద్రంలో టీడీపీ నాయకుల దీక్ష సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్యాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రదీప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబును జైలుకు పంపిన కేసులో సీఐడీ తరపున వాదించిన అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డిని తన కేసులో ఓడించానంటూ శ్యాంబాబు విమర్శించడం హాస్యాస్పదమన్నారు. పొన్నవోలు సుధాకర్ రెడ్డి దెబ్బకు తన సోదరుడు చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో ఇదే శ్యాంబాబు 5 నెలలు రాష్ట్రం విడిచి పారిపోవడం మరిచిపోయాడన్నారు. ప్రస్తుతం చంద్రబాబు జైల్లో ఉన్నాడని, త్వరలో లోకేశ్‌బాబు, శ్యాంబాబు కూడా వెళ్తారన్నారు. లిక్కర్, కల్లు ఇసుక మాఫియాకు కేఈ కుటుంబం బ్రాండ్ అంబాసిడర్లన్నది జిల్లా అంతటా తెలుసన్నారు. చంద్రబాబు, లోకేశ్‌బాబుతోపాటు పత్తికొండకు కరువును తీసుకువచ్చావంటూ ఎద్దేవా చేశారు. తండ్రి డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నా చేతకానిది.. తమ పార్టీ అధికారం చేపట్టిన ఏడాది లోపే వెల్దుర్తి మండలానికి తాగునీరందించామన్నారు. ఇప్పటికై నా పద్ధతి మార్చుకుని, ప్రజలకు ఎలా సేవ చేయాలనే విషయంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు, కృష్ణాపురం, పుల్లగుమ్మి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి మరోసారి ప్రజలే బుద్ధి చెబుతారు

కేఈ శ్యాంబాబు వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకే తమ నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డిని పొట్టనపెట్టుకున్నారన్నారు. ఈ విషయం జిల్లా ప్రజలందరికీ తెలుసన్నారు. నియోజకవర్గ ప్రజల మనసు గెలుచుకునే ప్రయత్నాలు చేయక రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం శ్యాంబాబుకు తగదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాట్లాడుతూ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తోందన్నారు. పత్తికొండ మార్కెట్‌యార్డు డైరెక్టర్ గట్టు ఆరిఫ్ మాట్లాడుతూ కరోనా సమయంలో వేలాది మందికి ఎమ్మెల్యే శ్రీదేవి అన్నదానం, వస్తు దానం చేసిందన్నారు. సమావేశంలో సర్పంచ్ ముత్యాల శైలజ, ఎంపీటీసీ సభ్యులు చిట్టెమ్మ, మద్దమ్మ, పెద్దన్న, రాజు, ఏసు, స్వాములు పాల్గొన్నారు.